సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 10 । జూన్ । 2025



పేద పిల్లల భవిష్యత్తుకు సరికొత్త వేదిక షైనింగ్ స్టార్స్ 8లో



ఘనంగా పాణిహాటి మహోత్సవం 8లో



యోగా.. మంచిదేగా.! 8లో

రేషన్ కార్డు మంజూరుకు నిబంధనాలు

ఆదాయ పరిమితులు

గ్రామీణ ప్రాంతాల్లో
ఏడాదికి రూ. 1.20 లక్షలు

పట్టణ ప్రాంతాల్లో
ఏడాదికి రూ. 1.44 లక్షలు

దీని ప్రకారం, నెలవారీ ఆదాయ పరిమితి

గ్రామీణ ప్రాంతాల్లో
రూ. 10,000

పట్టణ ప్రాంతాల్లో
12,000

కార్డుల్లో మార్పులు, చేర్పులకు ఇక్కట్లు

తరచూ సర్వర్ సమస్య

సచివాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

మహారాణిపేట: కొత్త రేషన్ కార్డులు, మార్పులు–చేర్పులు, ఇతర సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త కార్డుల కోసం అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్ సమస్యలు వెంటాడుతుండటంతో దరఖాస్తుదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో సర్వర్ తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు **అధికారులు** వెల్లడించారు.

కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుదారు**లకు** సాఫ్ట్‌వేర్ సమస్యలు తీవ్ర తలనొప్పిగా మారాయి. అవసరమైన పత్రాలున్నా, నిబంధనల కారణంగా దరఖాస్తు చేయలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కొత్త పేర్ల నమోదు, తొలగింపు ప్రక్రియ నిలిచిపోయిందని, దీనివల్ల ప్రతిరోజూ సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోం**దని** అంటున్నారు. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రం**గా** ఉంది. తక్షణమే సాఫ్ట్‌వేర్‌ను మార్చాలని **ప్రజలు** డిమాండ్ చేస్తున్నారు.

సర్కార్ మొండి చెయ్యి

కూటమి నేతలు ఎన్నికల ముందు అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు మొండిచేయి చూపుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారం చేపట్టి ఏడాది దాటిన నేపథ్యంలో, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరింది. దీంతో అర్హులైన ప్రజలు దరఖాస్తు పత్రాలతో గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లగా, అక్కడ వారికి నిరాశే మిగులుతోంది. కార్డులో పేర్ల నమోదు, తొలగింపునకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో ఎటువంటి ఆప్షన్ లేదని సచివాలయ సిబ్బంది చెప్పడంతో దరఖాస్తుదారులు షాక్‌కు గురై వెనుదిరుగుతున్నారు.



నిబంధనలు ఇవే..

- విద్యుత్ బిల్లులు అధికంగా వస్తే కొత్త కార్డుకు అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. బిల్లులో తప్పులున్నా, విద్యుత్ అధికారుల సహాయంతో సరిచేసినా కూడా దరఖాస్తు చేయడానికి అవకాశం ఉండటం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులు ఉన్న వారి పేరున కొత్త రేషన్ కార్డులు జారీ కావని అధికారులు స్పష్టం చేస్తున్నారు.
- భార్యాభర్తలు కొత్త రేషన్ కార్డు కావాలనుకుంటే, వారి ఆధార్ కార్డులో స్థానిక చిరునామా కాకుండా వేరే అడ్రస్ ఉంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- ఇంటి మ్యాపింగ్ కూడా సక్రమంగా జరగడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఆధార్ కార్డులో చిరునామాలు సక్రమంగా ఉంటేనే ఇంటి మ్యాపింగ్ అవుతుందని అధికారులు చెబుతున్నారు.
- రేషన్ కార్డులో కుటుంబ సభ్యులుగా తల్లి, తండ్రి, కుమారుడు ఉన్నప్పుడు, కుమారుడికి వివాహం జరిగితే కొత్త కార్డు ఇవ్వడం లేదా ఈ కార్డు నుంచి తొలగించడానికి నిబంధనలు అడ్డు వస్తున్నాయి. కుమారుడు కుటుంబం వేరుగా ఉన్నా కొత్త కార్డు నమోదు చేయడానికి నిబంధనలు అడ్డు వస్తున్నాయని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- నాలుగు చక్రాల వాహనం(వ్యక్తిగత వినియోగానికి) ఉన్నవారు.
- ఆదాయపు పన్ను చెల్లించేవారు.
- గ్రామీణ ప్రాంతాల్లో మూడు ఎకరాల మాగాణి(వరి పండే భూమి) ఉన్నవారు, పదెకరాల మెట్ట భూమి ఉన్నవారు.
- ప్రతి నెలా 300 యూనిట్లకు మించి విద్యుత్ (గృహావసరాలకు) వినియోగించేవారు.
- నగరంలో 1000 చదరపు గజాల స్థలంలో ఇల్లు ఉన్నవారు.

పైన పేర్కొన్న అంశాలకు చెందినవారిని తెలుపు రేషన్ కార్డులకు అనర్హులుగా పరిగణిస్తారు.

కూటమి మోసంపై ఆగ్రహం



ఎన్నికల ముందు కొత్త రేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి రోజులు గడుస్తున్నా ప్రజలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు కార్డుల కోసం ఇంకా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అర్బన్ డీఎస్‌వో పరిధిలో మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి తదితర ప్రాంతాలు ఉన్నాయి. జిల్లాలో 5 లక్షల 12 వేల 619 తెలుపు కార్డులతోపాటు 625 చౌకధరల డిపోలు ఉన్నాయి.

నిబంధనలతో ఇబ్బంది

మా అబ్బాయి చదువు నిమిత్తం తీసుకున్న రుణాల కోసం ఐటీ నంబర్ తీసుకుంటే, దానిని సాకుగా చూపి రేషన్ కార్డుకు అనర్హులుగా చేయడం సరికాదు. విద్య అనేది ప్రాథమిక అవసరం. దీనికి కూడా ఇటువంటి నిబంధనలు పెడితే ఎలా?. విద్యారంగానికి ప్రోత్సాహం అందిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, ఇటువంటి నిబంధనలతో సామాన్యులకు ఇబ్బందులు సృష్టించడం తగదు.

– కె.అప్పారావు, రెల్లివీధి, జాలరిపేట, విశాఖపట్నం

ఉక్కు ఉద్యమంపై కుట్ర

- పోలీసుల ద్వారా కూటమి ప్రభుత్వం వేధింపులు
- దీక్షా శిబిరాన్ని ఆక్రమించిన పోలీసులు
- నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేసిన ఆందోళనకారులు
- పోలీసుల తీరుపై ఉక్కు కార్మికుల ఆగ్రహం



నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న ఉక్కు కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కూర్మన్నపాలెం వద్ద కొనసాగుతున్న దీక్షా శిబిరం వద్ద సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. శాంతియుతంగా జరుగుతున్న ఉద్యమాలను పోలీసుల ద్వారా అణచివేయాలని ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని కార్మిక సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. 1,579 రోజులుగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో దీక్ష కొనసాగుతుండగా సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. అంతేకాకుండా దీక్షా శిబిరంలోకి పోలీసులు చొరబడి కుర్చీలలో ఆశీనులవడంతో ఆగ్రహించిన కార్మికులు నేలపై కూర్చుని నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా పోలీసులు దౌర్జన్యం ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశత్వం విడనాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

కార్మిక సంఘాల నేతల ధ్వజం

అఖిల పక్ష కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ ప్రభుత్వాలు అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. శాంతియుతంగా జరుగుతున్న దీక్షలను పోలీసుల ద్వారా అణచివేయాలని చూడటం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉందని కారణం చూపి వారిని తొలగించడం సరికాదని పేర్కొన్నారు. కర్మాగారం స్థాపించినప్పటి నుంచి అనేక పోరాటాలు చేశామని, ఇంత దారుణంగా ఎవరూ ఎప్పుడూ వ్యవహరించలేదని పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ ఆరోపించారు. మునుపెన్నడూ లేని విధంగా దీక్షా శిబిరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం ఇదే ప్రథమమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి విధానాలు విడనాడకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

సిటు గౌరవ అధ్యక్షులు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ, కార్మికులను అణచివేసి కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని మండిపడ్డారు. ఇది పాలకులకు క్షేమకరం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 78వ వార్డు కార్పొరేటర్ బి. గంగారావు మాట్లాడుతూ, కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయాలన్న కుట్ర ప్రభుత్వ విధానాల్లో భాగమేనని, కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్ లో భాగంగానే కార్మికుల ఉద్యమాలను అణచివేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి నిర్ణయాలు ఉపసంహరించుకొని తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని గంగారావు హెచ్చరించారు. భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, కేఎం .శ్రీనివాస్, రామచంద్రరావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మినేని అరెస్ట్.. కూటమి డైవర్షన్ రాజకీయం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి డా. మంచా నాగమల్లేశ్వరి



మహారాణిపేట: కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల వ్యతిరేకతను మళ్లించేందుకే సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేశారని వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి డా. మంచా నాగమల్లేశ్వరి ఆరోపించారు. మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నా హోంమంత్రి వంగలపూడి అనిత పట్టించుకోవడం లేదని ఆమె మండిపడ్డారు. సోమవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. సొంత జిల్లాలో మహిళ హత్య జరిగినా హోంమంత్రి పరామర్శించకపోవడం దౌర్భాగ్యమని నాగమల్లేశ్వరి విమర్శించారు. ముఖ్యమంత్రి స్వయంగా హోంమంత్రిత్వ శాఖ చివరి స్థానంలో ఉందని ప్రకటించడం చూస్తే, మహిళల రక్షణ గాలికి వదిలేసినట్టేనని అన్నారు. పచ్చ మీడియా ఓనర్లను, జర్నలిస్టులను కూడా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో బాలికపై అత్యాచారం జరిగినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని నిలదీశారు. డైవర్షన్ రాజకీయాలు మాని మహిళల ప్రాణాలు రక్షించాలని హోంమంత్రి అనితకు సూచించారు.

సాక్షి కార్యాలయాలపై దాడులు సరికాదు

జిల్లా వ్యాప్తంగా పోలీసులకు జర్నలిస్టుల ఫిర్యాదు

ఆరిలోవ/తగరపువలస/గాజువాక/అల్లిపురం/పెందుర్తి: రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై టీడీపీ దాడులకు పాల్పడడం సరికాదని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. సాక్షి కార్యాలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు ఆయా పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులు చేశారు. ఆరిలోవలో సీఐకి ఫిర్యాదు అందజేయగా.. గాజువాక సీఐ పార్థసారథిని స్థానిక సాక్షి విలేకరులు కలిసి ఫిర్యాదు చేశారు. దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే టూటౌన్ ఎస్.ఐ సతీష్‌కు సాక్షి విలేకరులు ఫిర్యాదు చేశారు. సాక్షి కార్యాలయాలపై జరిగిన దాడులను భీమిలి నియోజకవర్గంలో జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు తప్పుపట్టాయి. మధురవాడ ప్రాంత పాత్రికేయులు ఏసీపీ అప్పలరాజు, సీఐ బాలకృష్ణకు ఫిర్యాదు అందజేశారు. భీమిలి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు హెడ్ కానిస్టేబుల్ సన్యాసిరావుకు ఫిర్యాదు చేశారు. పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ రమణకు సాక్షి విలేకరులు ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు చేపట్టిన రాజకీయ ప్రేరేపిత దాడులు, ఇతర నేర చర్యలపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సాక్షి మీడియా విశాఖ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ వర్రి చంద్రారావు ఫిర్యాదు చేశారు. తమ కార్యాలయం ఎదుట అనుమతి లేకుండా గుంపులుగా చేరి దాడులకు పాల్పడ్డారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



భీమిలి హెడ్ కానిస్టేబుల్ సన్యాసిరావుకు వినతి పత్రం అందిస్తున్న భీమిలి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

భీమిలి వరకు యోగా వేడుకలు



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ.కృష్ణబాబు

మహారాణిపేట: ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ జీ. వీరపాండియన్, కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌తో కలిసి ఆయన యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ భారీ యోగా కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకునే అవకాశం ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కృష్ణబాబు సూచించారు. ప్రధాన వేదిక నుంచి భీమిలి వరకు జరిగే ఈ కార్యక్రమానికి విద్యుద్దీకరణ, ఇంటర్నెట్, ఎల్ఈడి స్క్రీన్‌లు, సీసీ కెమెరాలు, డ్రోన్లు, రవాణా, పార్కింగ్, తాగునీరు వంటి అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కే. విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, పలువురు రాష్ట్ర, జిల్లా అధికారులు, ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజకీయ సిఫార్సులకే పెద్దపీట?

- ఉమ్మడి విశాఖలో బదిలీల దుమారం
- ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నో బదిలీ
- పెందుర్తిలో బాజ్జీకి భంగపాటు?



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జరిగిన రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఉద్యోగుల బదిలీలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఏళ్ల తరబడి ఒకే చోట పాతుకుపోయిన, ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు తహసీల్దార్లకు స్థానచలనం కల్పించకపోవడం, అదే సమయంలో కీలకమైన పోస్టులను భర్తీ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ బదిలీల ప్రక్రియలో కూటమి ఎమ్మెల్యేల సిఫార్సులకే పెద్దపీట వేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖలో జరిగిన తహసీల్దార్ల బదిలీలలో రాజకీయ జోక్యం స్పష్టంగా కనిపిస్తోంది. పెందుర్తి తహసీల్దార్ బదిలీ విషయంలో అక్కడి ఎమ్మెల్యే పంతం నెగ్గించుకున్నారు. ఈ విషయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ సిఫార్సులను పరిగణలోకి తీసుకోలేదని సమాచారం. భీమిలి ఎమ్మెల్యే సిఫార్సు మేరకే ఆనందపురం తహసీల్దార్‌ను బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఎక్కువ సంవత్సరాలు పనిచేసిన కారణంగా గాజువాక తహసీల్దార్ బదిలీ జరిగింది. అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు అధికారులను కదపకపోవడం గమనార్హం. వీరితో పాటు డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందితో కలిపి రెవెన్యూ శాఖలో మొత్తం 62 మందిని బదిలీ చేశారు.

పంచాయతీరాజ్‌లో 75 మందికి స్థానచలనం

జిల్లా పరిషత్‌లో కూడా భారీగా బదిలీలు జరిగాయి. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి మొత్తం 75 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఐదుగురు ఎంపీడీవోలు, ఐదుగురు పరిపాలనాధికారులు, 4 సీనియర్ అసిస్టెంట్లు, 11 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టులు, 12 మంది రికార్డు అసిస్టెంట్లు, 30 మంది ఆఫీస్ సబార్డినేట్లు, ఆరుగురు నైట్ వాచ్‌మెన్లు ఉన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పాల్గొన్నారు.

బదిలీ అయిన రెవెన్యూ అధికారులు వీరే..

మండలం/స్థానం	తహసీల్దార్/సూపరింటెండెంట్ పేరు	కేటాయించిన స్థానం
పెందుర్తి	ఎం.ఆనందకుమార్	అనకాపల్లి జిల్లా
ములగాడ	ఎం.భుజంగరావు	అనకాపల్లి జిల్లా
కలెక్టరేట్(అల్లూరి)	బి.నాగరాజు	అనకాపల్లి జిల్లా
కలెక్టరేట్(అల్లూరి)	సీహెచ్ తిరుమలరావు	అనకాపల్లి జిల్లా
కలెక్టరేట్(అల్లూరి)	ఎం.భాస్కరఅప్పారావు	అనకాపల్లి జిల్లా
అల్లూరి జిల్లా	టి.రామకృష్ణ	పెందుర్తి మండలం
అల్లూరి జిల్లా	ఎంవీవీప్రసాద్	ల్యాండ్ ప్రొటెక్షన్(విశాఖ)
కలెక్టరేట్(అనకాపల్లి)	బీవీ రాణి	మెజిస్టీరియల్ సెక్షన్(విశాఖ)
అచ్యుతాపురం	జి.జనార్దన్	అల్లూరి జిల్లా
ఆనందపురం	పి.శ్యాంప్రసాద్	కోఆర్డినేషన్ సెక్షన్(విశాఖ)
(ఆనందపురం హెచ్‌డీటీ ఎల్.చేతన్ కుమార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియామకం)		
గాజువాక	టి.శ్రీ వల్లి	వీఎంఆర్డీఏ
(గాజువాక హెచ్‌డీటీ బి.శ్రీనివాసరావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియామకం)		
సీతమ్మధార	ఎం.రమేష్‌ను	ములగాడ
(సీతమ్మధార హెచ్‌డీటీ ఎస్.ఎ.త్రినాథరావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియామకం)		

కొవ్వొత్తులతో సాక్షి సిబ్బంది నిరసన



సాక్షి కార్యాలయాలపై రాష్ట్రంలో పలుచోట్ల టీడీపీ శ్రేణులు పాల్పడిన దాడులకు నిరసనగా విశాఖపట్నంలో సాక్షి మీడియా సిబ్బంది కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. సోమవారం రాత్రి సాక్షి కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాక్షిలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. -సాక్షి, విశాఖపట్నం

'కూటమి'కి ప్రజాగ్రహం తప్పదు

- వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశంలో గొల్ల బాబూరావు

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వంలో 108 అంబులెన్స్ సేవలు అంధకారంలో ఉన్నాయని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 8వ తేదీన విశాఖ బీచ్ రోడ్డులో సముద్ర కెరటాల్లో చిక్కుకున్న ఒక బాలుడు సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతో ప్రాణాలు కోల్పోయాడని ఆయన ఆరోపించారు. వెంటనే అంబులెన్స్ వచ్చి ఉంటే ఆ బాలుడు బతికేవాడని, ఈ సంఘటన తన హృదయాన్ని కలచివేసిందని బాబురావు అన్నారు. 'పేదల ప్రాణాలు కాపాడలేని ఈ కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం తప్పద'ని హెచ్చరించారు. ఈ దుస్థితిని చక్కదిద్దేందుకు తన ఎంపీ నిధుల నుంచి మూడు అంబులెన్స్‌లు కొనుగోలు చేసి, వాటి ద్వారా వైద్య సేవలు అందిస్తానని ప్రకటించారు. ఈ అంబులెన్స్‌లకు డ్రైవర్లను తానే నియమించి, వారి జీతాలను కూడా స్వయంగా భరిస్తానని తెలిపారు. సోమవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ కేడర్‌తో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో గొల్ల బాబూరావు మాట్లాడుతూ పార్లమెంటు నిధులను విశాఖ అభివృద్ధి కోసం వినియోగిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ.. గొల్ల బాబూరావు మంచి రాజకీయ నాయకుడిగానే కాకుండా సమర్థవంతమైన ప్రభుత్వ అధికారిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, మొల్లి అప్పారావు, తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి , తైనాల విజయ కుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్ కటమూరి సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, ముఖ్యనేతలు పేర్ల విజయచందర్, రొంగలి జగన్నాథం, వుడా రవి, రవి రాజు, నడింపల్లి కృష్ణంరాజు, సతీష్ వర్మ, మంత్రి రాజశేఖర్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, పల్లా చినతల్లి, పేడాడ రమణి కుమారి, సనపల రవీంద్ర భరత్, శివ రామకృష్ణ, భర్కత్ అలీ, ఎస్. ప్రసాదరావు, రామి రెడ్డి, బోండా ఉమా మహేశ్వరరావు, దేవరకొండ మార్కండేయులు, పీలా ప్రేమ కిరణ్ , రాయపు రెడ్డి అనిల్ కుమార్, దిలీప్ మారుతి ప్రసాద్ , కార్పొరేట్లు అల్లు శంకర్ రావు, కొండబాబు, కటారి అనిల్ కుమార్ రాజు, మువ్వల లక్ష్మీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ, పీవీ సురేష్ , భూపతి రాజు సుజాత, కాళిదాస్ రెడ్డి, అల్లంపల్లి రాజబాబు, వేంపాడ శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ రాజు , పి.దుర్గారావు, నాగ మల్లీశ్వరి, ఆళ్ల కృష్ణ, సత్యాల సాగరిక, నీలి రవి, అప్పన్న , జి.నాగేంద్ర, బి.పద్మావతి, శ్రీదేవి వర్మ,జ్యోతి, గంగా మహేష్, సూర్య, మహేష్ బాబు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంబా రవిబాబు, పార్టీ సమన్వయకర్తలు

సింహాచలం ఈవో బదిలీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో వి. త్రినాథరావును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ని దేవదాయశాఖ రాజమహేంద్రవరం మల్టీ జోన్–1 రీజనల్ జాయింట్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వి. వినయ్‌చంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సింహాచలం దేవస్థానానికి కొత్త ఈవో నియమితులయ్యే వరకు త్రినాథరావే ఇన్‌చార్జి ఈవోగా కొనసాగాలని ఈ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



త్రినాథరావు

పేద పిల్లల భవిష్యత్తుకు సరికొత్త వేదిక షైనింగ్ స్టార్స్

- షైనింగ్ స్టార్స్ ప్రదానోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా
- 121 మందికి నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాల బహూకరణ

మద్దిలపాలెం: పేదంటి పిల్లల బంగారు భవిష్యత్తుకు సరికొత్త వేదికగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్స్-2025 నిలుస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవం ఏయూలోని అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో సోమవారం జరిగింది. మంత్రి డోలా, ఎంపీ శ్రీభరత్, విప్ గణబాబు, ఏపీ గ్రోవర్స్ అండ్ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తొలుత విద్యార్థులు ఏర్పాటు చేసిన డ్రీమ్, గ్రాటిట్యూడ్ వాల్స్‌ను సందర్శించి, అందులో విద్యార్థులు పేర్కొన్న అంశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి వీరాంజనేయస్వామి మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు నెల నెలా రూ.6 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. వారం రోజుల్లో తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, పేద విద్యార్థుల సౌకర్యార్థం ఈ ఏడాది నుంచి ఎస్సీ గురుకులాల్లో ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్ తరగతులు అందిస్తామని వెల్లడించారు. ఇప్పటికే మూడు కేంద్రాల్లో ఈ ప్రక్రియ నడుస్తోందని, మరో ఏడు కేంద్రాల్లో తదుపరి చర్యలు చేపడతామని మంత్రి స్పష్టం చేశారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విద్యార్థులు బట్టీ చదువులకు స్వస్తి పలకాలని, కాన్సెప్ట్ ఓరియంటెడ్ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచీ చదువులో చురుగ్గా ఉండి, విదేశాల్లో ఉన్నత విద్యను చదివిన విద్యాశాఖ మంత్రి లోకేశ్ రూపొందించిన షైనింగ్ స్టార్స్ కార్యక్రమం బృహత్తరమైనదిగా పేర్కొన్నారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ విద్యా రంగంలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఫలితాల సాధనపై ప్రత్యేక దష్టి సారిస్తున్నామన్నారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో విశాఖ మూడో స్థానంలో నిలిచిందని, వచ్చే ఏడాదికి ప్రథమస్థానానికి చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. షైనింగ్ స్టార్స్‌లో 83 మంది టెన్త్, 38 మంది ఇంటర్ విద్యార్థులకు చెరో రూ.20 వేలు చొప్పున రూ.24.20 లక్షలు నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అతిథుల చేతుల మీదుగా అందించారు.

జేటీసీగా వెంకటేశ్వరరావు

గోపాలపట్నం: విశాఖపట్నం జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా ఎస్.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన విజయవాడ జేటీసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా రాజారత్నం విధులు నిర్వహించేవారు. ఆయన బదిలీ అయిన తర్వాత ఆర్టీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

బీసీ కార్పొరేషన్ ఈడీగా శంకరరావు

ఎంవీపీకాలనీ: జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా కె.శంకరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం కృష్ణా జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ని విశాఖ జిల్లా ఈడీగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విశాఖ జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.శ్రీదేవిని అనకాపల్లి జిల్లా ఈడీగా బదిలీ చేశారు.

ఘనంగా పాణిహాటి మహోత్సవం



బలరామకృష్ణ విగ్రహాలకు పాలు, పుష్పాభిషేకాలు

భీమునిపట్నం: భీమిలి సాగరసంగమం సమీపంలో హరేకృష్ణ మూమెంట్(గంభీరం) ఆధ్వర్యంలో సోమవారం పాణిహాటి మహోత్సవ కార్యక్రమాన్ని భక్తులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవం ముందుగా సామూహిక సంకీర్తనలతో ప్రారంభమైంది. అనంతరం బలరామకృష్ణుని విగ్రహాలకు పాలు, వివిధ నదుల నుంచి సేకరించిన జలాలు, పంచామృతాలు, పూలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించన భక్త దాస మాట్లాడుతూ ఈ ఉత్సవానికి ఒక ప్రత్యేక చరిత్ర, గుర్తింపు ఉన్నాయని వివరించారు. హరేకృష్ణ మూమెంట్ వ్యవస్థాపకులు శ్రీచైతన్య మహాప్రభువు, నిత్యానంద ప్రభువులు కోల్‌కతా సమీపంలోని పాణిహాటి గ్రామం వద్ద కృష్ణతత్వాన్ని అన్ని ప్రాంతాలకు విస్తరింపజేశారన్నారు. అందులో భాగంగా గంగానది తీరంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించగా.. అప్పటి నుంచి దీనిని నదీ తీరాల వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు గోస్తని నది తీరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అందరూ చక్కని జీవన ప్రయాణాన్ని సాగించాలంటే కృష్ణతత్వాన్ని అనుసరించాలని భక్త దాస సందేశమిచ్చారు. అంబరీష్ దాసతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

జీవీఎంసీ సీఈగా పల్లంరాజు

మహారాణిపేట: జీవీఎంసీ ఇన్‌చార్జి చీఫ్ ఇంజినీర్‌గా జి.వి.పల్లంరాజు నియమితులయ్యారు. ఇక్కడ చీఫ్ ఇంజినీర్‌గా పని చేసిన పి.శివ ప్రసాద్ రాజు గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానంలో పల్లంరాజును నియమిస్తూ.. పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖలో మంత్రి లోకేష్

మహారాణిపేట: పార్వతీపురం మన్యం జిల్లా పర్యటన ముగించుకొని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సోమవారం రాత్రి విశాఖ చేరుకున్నారు. రామ్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయానికి చేరుకొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మంగళవారం కూడా మంత్రి లోకేష్ వినతులు స్వీకరిస్తారు.

యోగా.. మంచిదేగా!

ఏయూక్యాంపస్: యోగాంధ్రలో భాగంగా ఎం జీఎం లాన్-1లో సోమవారం వీఎంఆర్డీఏ సిబ్బంది యోగాసనాలు సాధన చేశారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్ విశ్వనాథన్ పాల్గొని.. నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని సూచించారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం వీఎంఆర్డీఏకు చెందిన ఐదు వందల మంది సిబ్బంది యోగాసనాలు వేశారు. జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీ శంకర్, బలరామ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగరతీరంలో ఏర్పాటు చేసిన సైకత శిల్పం అందరినీ ఆకట్టుకుంది.

భర్తపై నూనెతో దాడి చేసిన భార్య అరెస్ట్

పరవాడ: సాలాపువానిపాలెంలో గత నెల 22న భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్తపై మరిగిన నూనెతో దాడి చేసిన కేసులో నిందితురాలు నక్క రమణమ్మను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు సోమవారం ఈ వివరాలు వెల్లడించారు. సాలాపువానిపాలెంలో నివాసం ఉంటున్న గండికోట బాలకృష్ణ, నక్క రమణమ్మ దంపతుల మధ్య గత నెల 22వ తేదీ రాత్రి ఘర్షణ జరిగింది. తెల్లవారుజాము 3 గంటల సమయంలో రమణమ్మ.. నిద్రపోతున్న బాలకృష్ణ ముఖంపై మరిగించిన వేడి నూనెను పోసి అక్కడి నుంచి పరారైంది. ఈ ఘటనలో బాలకృష్ణ ముఖం, కళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానికులు అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితురాలు అనకాపల్లిలోని పూడిమడక రోడ్డులో సంచరిస్తున్నట్లు సమాచారం అందుకున్నారు. ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. రమణమ్మ గతంలో బాలకృష్ణపై యాసిడ్‌తో దాడి చేసింది. శ్రీకాకుళం జిల్లా బూర్జ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు పెండింగ్‌లో ఉన్నట్లు సీఐ తెలిపారు. అలాగే గాయపడిన బాలకృష్ణపైనా దొంగతనాలకు సంబంధించిన పలు కేసులు నమోదై ఉన్నాయని సీఐ వెల్లడించారు.

రోగులకు మెరుగైన వైద్యం నా లక్ష్యం: డాక్టర్ వాణి



మహారాణిపేట: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా ప్రసూతి, స్త్రీ వ్యాధుల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ పోస్టు అదనపు డీఎంఈ కేడర్‌లో ఉండటంతో.. అదే కేడర్‌కు చెందిన డాక్టర్ వాణిని నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇప్పటివరకు ఆ పదవిలో ఉన్న డాక్టర్ పి.శివానంద్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి, అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ జి.మెహర్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఇతర వైద్యులు, పరిపాలన సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ వాణి మాట్లాడుతూ రోగులకు మెరుగైన సంరక్షణ, ఉన్నతమైన చికిత్స ప్రమాణాలు అందించడమే తన ప్రథమ లక్ష్యమని తెలిపారు.

గోస్తనీ దాటితేనే కూడు..

ఇదీ పాత మూలకుద్దు వాసుల గోడు

- వాహనాల రద్దుతో మళ్లీ రేషన్ కష్టాలు

తగరపువలస: ప్రభుత్వం మారడంతో పాత మూలకుద్దు వాసుల రేషన్ కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. రేషన్ సరకుల కోసం వారు ప్రాణాలకు తెగించి పీకలలోతు గోస్తనీ నదిని దాటడమో లేదా 20 కిలోమీటర్లు ప్రయాణించి వందలాది రూపాయలు ఖర్చు చేయడమో తప్పనిసరిగా మారింది. పది రోజులుగా రేషన్ అందక సుమారు 150 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. వివరాలివి.. భీమిలి మండలంలోని మూలకుద్దు పంచాయతీని గోస్తనీ నది పాత మూలకుద్దు, కొత్త మూలకుద్దు అనే రెండు గ్రామాలుగా విడదీస్తుంది. రేషన్ డిపో కొత్త మూలకుద్దులో ఉండటంతో పాత మూలకుద్దు గ్రామస్తుల అవస్థలు వర్ణనాతీతం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరకులు అందేవి. అయితే కూటమి ప్రభుత్వం ఆ వాహనాలను రద్దు చేయడంతో వీరి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. పాత మూలకుద్దుకు చెందిన 160, సమీపంలోని చిప్పాడ పంచాయతీకి చెందిన పండవానిపాలెం వాసులు 30 మంది మొత్తం 190 రేషన్ కార్డుదారులు కొత్త మూలకుద్దులోని రేషన్ డిపోపై ఆధారపడి ఉన్నారు. వాహనాలు రద్దయిన తర్వాత గత పది రోజుల్లో కేవలం 40 మంది మాత్రమే నది దాటి, ప్రయాణ ఖర్చులు భరించి సరకులు తెచ్చుకోగలిగారు. ఈ నేపథ్యంలో కార్డుకు రూ.50 చెల్లిస్తే రవాణా ఖర్చులు భరించి సరకులు తెచ్చిస్తామని కూటమి నాయకులు ప్రతిపాదించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ గ్రామానికి రేషన్ డిపో మంజూరు చేయాలని లేదా గతంలో మాదిరిగా వాహనాల ద్వారా పంపిణీని పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

బయోడైవర్సిటీ పార్కులో శ్రీగంధం చెట్ల నరికివేత



పార్కులో వదిలేసిన చెట్ల కొమ్మలు

టీచర్స్ కాలనీ: పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్కులో 23 ఏళ్ల వయసున్న మూడు శ్రీగంధం చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. ఈ దొంగలు పార్కు కంచెను తొలగించి, ఆరు నుంచి ఏడు అడుగుల పొడవైన కలప దుంగలను దొంగిలించారు. పార్కు నిర్వాహకుడు రామమూర్తి సోమవారం ఉదయం చెట్లు నరికివేయడాన్ని గుర్తించారు. వెంటనే మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది కేవలం గంధపు చెట్ల దొంగతనం కాదని, పార్కును నాశనం చేయడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెట్లను నరికిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: సౌత్ వెస్టర్న్ రైల్వే పరిధిలోని యశ్వంత్‌పూర్ జంక్షన్ స్టేషన్‌లో భద్రతా పరమైన ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఆ మార్గంలో ప్రయాణించే కొన్ని రైళ్ల గమ్యస్థానాలను కుదించినట్లు వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 11, 18, 25వ తేదీల్లో హౌరా-యశ్వంత్‌పూర్(22831) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ యల్లహంక స్టేషన్ వరకు మాత్రమే నడుస్తుంది. 13, 20, 27వ తేదీల్లో యశ్వంత్‌పూర్-హౌరా(22832)సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ యల్లహంక నుంచి బయలుదేరుతుంది. ఈ నెల 12,19, 26 తేదీల్లో సంత్రగచ్చి-యశ్వంత్‌పూర్ (02863) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ యల్లహంక జంక్షన్ వరకు మాత్రమే నడుస్తుంది. 14, 21, 28వ తేదీల్లో యశ్వంత్‌పూర్-సంత్రగచ్చి (02864)సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ యల్లహంక నుంచి బయలుదేరుతుంది. ఈ తేదీల్లో ఈ రైళ్లు యశ్వంత్‌పూర్-యల్లహంక స్టేషన్ల మధ్య రాకపోకలు సాగించవు.

యోగా దినోత్సవానికి ప్రత్యేక అధికారులు

మహారాణిపేట: యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో విస్తృత ఏర్పాట్లు, సమన్వయం కోసం పలువురు సీనియర్ అధికారులను నియమించారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు కూడా ఇన్‌చార్జులను నియమించారు. ఈ బృందంలో 9 మంది ఐఏఎస్ అధికారులు, 31 మంది డిప్యూటీ కలెక్టర్లు, ఏడుగురు సివిల్ సప్లైస్ అధికారులు, 109 మంది తహసీల్దార్లు ఉన్నారు.